క్లుప్తంగా

నేడు వీఎంసీ కార్యాలయాల్లో స్పందన

పటమట(విజయవాడతూర్పు): నగరంలో సమస్యల పరిష్కారానికి 'స్పందన'ను వినియోగించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, అర్జీలను స్వీకరించడానికి సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే స్పందన జరుగుతుందని నగరవాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో కూడా తమ సమస్యలను ఆయా ప్రాంతవాసులు జోనల్ కమిషనర్ల దష్టికి తీసుకెళ్లవచ్చని వివరించారు.

సామాన్యులపై భారం మోపిన కేంద్రం



పాయకాపురం(విజయవాడరూరల్): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు అన్నారు. ఆదివారం 62, 63 డివిజన్ల నేతల ఆధ్వర్యాన కూరగాయల కొట్టు సెంటర్లో గ్యాస్ ధరలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కె.దుర్గారావు, నేతలు చింతల శ్రీనివాస్, ఎం.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కండ్రికలో గడప గడపకు మన ప్రభుత్వం

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 64వ డివిజన్ 285 సచివాలయం పరిధిలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే విష్ణు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కండ్రికలోని కార్పొరేటర్ కార్యాలయం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయానికి పుస్తకాలు, క్రీడా పరికరాలు




గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అయ్యంకి వెంకట రమణయ్య స్మారకార్థం ఆయన మనువడు 'సరస్వతి సామ్రాజ్యం' అధ్యక్షులు అయ్యంకి మురళీకృష్ణ.. ఠాగూర్ గ్రంథాలయానికి క్రీడా పరికరాలు, పుస్తకాలు అందజేశారు. ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య 44వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. అయ్యంకి విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమల పూర్ణమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి చేసిన సేవలను కొనియాడారు. పరికరాలు అందజేసిన మురళీకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రమాదేవి, సునీత, రమేష్, జగదీష్, మోహన్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

11న సంకటహర చతుర్థి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీ దత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ఈనెల 11వ తేదీ శనివారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు స్వామివారికి విశేషంగా రుద్రాభిషేకం, అలంకార అర్చన జరుగుతాయని పేర్కొన్నారు

గ్రంథాలయాలు విజయానికి సోపానాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాలు విజయానికి సోపానాలు అని చిత్తరంజన్ శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ సంపత్ కుమార్ చెప్పారు. స్థానిక సత్యనారాయణపురం చిత్తరంజన్ శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవటం -మాకు ఇష్టం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల సేవలను ప్రజలకు తెలియచేసేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు మాస్ రీడింగ్, చదవటం మాకుఇష్టం ఉపయోగాలు అంశంపై పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతగా రిటైర్డ్ ఉద్యోగి పి.శ్రీనివాసులు వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

విద్యుత్ సమస్యలకు చెక్

- కోతలు... లో ఓల్టేజీ ఇబ్బంది లేకుండా.. విద్యుత్ కాంతులు..
- సెంట్రల్‌లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు రంగం సిద్ధం
- రూ.20 కోట్లతో నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్లు
- ప్రారంభానికి సిద్ధమైన 3 సబ్‌స్టేషన్లు, మరో మూడు నెలల్లో మరొకటి



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఉడా కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలో విద్యుత్ కోతలు.. లోఓల్టేజీల సమస్యలు తొలగనున్నాయి. ఇక నియోజకవర్గంలో విద్యుత్ కాంతులీననున్నాయి. శివారులో పెరుగుతున్న వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు రంగం సిద్ధం చేసింది. దీంతో మండు వేసవిలోనూ విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యలకు దాదాపుగా చెక్ పెట్టినట్టైంది.

రూ.20 కోట్లతో నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్లు

విద్యుత్ వినియోగం, రద్దీ అధికంగా ఉన్న నాలుగు ప్రధాన ప్రాంతాలను గుర్తించి అక్కడ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీటి కోసం రూ.20 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసి చకచకా పనులు పూర్తి చేస్తోంది.

నాలుగు స్టేషన్లు ఇవే

శ్రీనగర్ కాలనీలో రూ.5 కోట్ల వ్యయ అంచనాతో ఓ సబ్‌స్టేషన్, ట్రెండ్ సెట్ ప్రాంతంలో రూ.5 కోట్లతో మరో సబ్‌స్టేషన్, ఉడాకాలనీలో రూ.4 కోట్లతో సబ్‌స్టేషన్, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద రూ.6 కోట్ల వ్యయంతో ఒక సబ్‌స్టేషన్‌ను నిర్మించడానికి పనులు చేపట్టారు. వీటిలో శ్రీనగర్‌కాలనీ, ట్రెండ్‌సెట్ ప్రాంతం, ఉడాకాలనీ సబ్‌స్టేషన్లలో నిర్మాణ పనులన్నీ పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఎంబీ స్టేడియం సబ్‌స్టేషన్ నిర్మాణానికి వైరింగ్ పనులు పూర్తికాగా సబ్‌స్టేషన్ పూర్తయ్యేసరికి మరో మూడు నెలలు పట్టనుంది.

రూ.5 కోట్లతో టవర్ల నిర్మాణం

నియోజకవర్గంలోని పలు ప్రధాన లైన్లలో వినియోగదారులకు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉన్న 9 మీటర్ల విద్యుత్ స్తంభాల స్థానంలో 16 మీటర్ల టవర్లను ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. మొగల్రాజపురం, సూర్యారావుపేట, నక్కలరోడ్డు ప్రాంతాల్లోని లైన్లను మార్చనున్నారు. వీటికోసం 5 కోట్ల నిధులను కూడా ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది.

నాణ్యమైన విద్యుత్

ఈ పనులతో నగర శివారుల్లో సైతం లోఓల్టేజీ సమస్యలు లేని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయనున్నారు. చిన్న విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

చివరి ఇంటికి కూడా విద్యుత్



నియోజకవర్గంలోని నగర శివారులో చివరి ఇంటికి కూడా విద్యుత్ సరఫరాను అందించడానికి కృషి చేస్తున్నాం. పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నాం. వేసవి దృష్ట్యా ఈ పనులన్నీ ఇప్పటికే పూర్తిచేశాం. త్వరలో వాటిని ప్రారంభించనున్నాం. విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

–మల్లాది విష్ణు, సెంట్రల్ ఎమ్మెల్యే

అందరికీ ఉపయోగం

నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసిస్తున్న 8 నుంచి 10 వేల కుటుంబాలకు వరకూ మేలు కలుగుతుంది. ప్రభుత్వ సహకారంతో సబ్‌స్టేషన్ల నిర్మాణాలు అనుకున్న సమయానికి పూర్తి చేయగలిగాం. ఎంబీ స్టేడియం సబ్‌స్టేషన్‌తో పాటు 16 మీటర్ల టవర్ల నిర్మాణ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తాం.

– బీవీ సుధాకర్, ట్రాన్స్‌కో డీఈఈ

వాస్తవాలు తెలుసుకుని ప్రసారం చేయాలి

ఏసీపీ రమణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమణమూర్తి, పక్కన సీఐ లక్ష్మీనారాయణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పూటుగా మద్యం సేవించి రోడ్డు మీద పడిపోయిన వ్యక్తిని పక్కకు కూర్చోబెట్టిన పోలీసులపై ఓ చానల్ అసత్య వార్తను ప్రసారం చేయడం బాధాకరమని, వాస్తవాలు తెలుసుకోవాలని ఏసీపీ రమణమూర్తి అన్నారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో అయోధ్యనగర్ వద్ద రెడ్డి వీరబాబు అనే వ్యక్తి పూటుగా మద్యం సేవించి రోడ్డుమీద పడిపోయాడని తెలిపారు. ఆ సమయంలో కొట్లను మూయించేందుకు వచ్చిన పోలీస్ రక్షక్ వాహనాన్ని పట్టుకొని అతను పైకి లేస్తున్నాడని పేర్కొన్నారు. దాన్ని గమనించిన రక్షక్ వాహన సిబ్బంది కిందకు దిగి అతడు మళ్లీ రోడ్డు మీదకు రాకుండా స్థానికుల సాయంతో రోడ్డు పక్కన కూర్చోబెట్టి వెళ్లారన్నారు. అయితే దీనికి పూర్తి భిన్నంగా మద్యం సేవించిన వీరబాబును రక్షక్ వెహికలే ఢీకొట్టిందని, తీవ్రగాయాలపాలైన అతన్ని పట్టించుకోకుండా పోలీసులు ఈడ్చుకుంటూ వెళ్లిపోయారంటూ ఓ చానల్ (సాక్షి కాదు)లో అసత్య వార్తను ప్రసారం చేయడం దారుణమన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా, బాధితుడిని, స్థానికులను విచారించకుండాపోలీసు వ్యవస్థ ప్రతిష్టను దిగజార్చేలా కథనాలను ప్రసారం చేయడం సరికాదని హితవు పలికారు. ఇటువంటి నిరాధారణ వార్తను ప్రసారం చేసిన చానల్‌పై ఐపీసీ 500 సెక్షన్‌కింద కేసు నమోదు చేసి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు కూడా చేయనున్నట్లు తెలిపారు. వాస్తవాలను తెలుసుకొని కథనాలను ప్రసారం చేయాలని కోరారు. సీఐ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ, స్టేషన్ ఎస్సైలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న నాగుల్ మీరా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆజాద్ ముస్లిం కమిటీ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర సహాయ కార్యదర్శి సయ్యద్ మౌలాలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రంజాన్‌లో తమ నియోజకవర్గాల్లోని పేద ముస్లింలకు చేయూతనందించాలన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు ముస్లిం మైనార్టీలు నివసించే ప్రాంతాల్లో పర్యటించి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమస్యలపై పోరాటంలోనూ, రాజకీయాల్లో, సేవా కార్యక్రమాల్లో ఆజాద్ కమిటీ అగ్రభాగాన నిలవాలన్నారు. అనంతరం నూతన కమిటీల నియామకం చేశారు.ఆజాద్ ముస్లిం కమిటీ కృష్ణా జిల్లా అధ్యక్షులుగా అబ్దుల్ అజ్మతుల్లా, ఎన్టీఆర్ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులుగా షేక్ షాకిర్, పల్నాడు జిల్లా అధ్యక్షులుగా అబ్దుల్ అజీజ్, విజయవాడ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్, నగర ఉపాధ్యక్షులుగా షేక్ రఫీ లను నియమించారు. వారికి రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ(హఫీజ్), రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ అజ్మతుల్లా, సెంట్రల్ ఇన్‌చార్జి మహమ్మద్ కాలేషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి సయ్యద్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

గుణదల(విజయవాడతూర్పు): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తుందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. ఆదివారం గుణదలలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ జరిగింది. అవినాష్ మాట్లాడుతూ కొన్ని వైద్య సేవలకు ఆరోగ్యశ్రీ వర్తించకపోతే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపడం హర్షణీయమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 4, 16, 21 డివిజన్లకు చెందిన ముగ్గురికి మంజూరైన రూ.1.20 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అవినాష్ మాట్లాడుతూ లంచాలకు తావులేకుండా పారదర్శకంగా సీఎంఆర్‌ఎఫ్ మంజూరు జరుగుతుందని, టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలకు లంచాలు అందితేనే ఇచ్చేవారని విమర్శించారు. టీడీపీ హయాంలో జరిగిన సమ్మిట్‌లో మంత్రుల డ్రైవర్లు, ఇతర అనామకులను తీసుకొచ్చి ఎంవోయూలు చేసుకొని ప్రచారాలు చేసుకున్నారని, వాటిలో ఒక్కటైనా కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో 4వ డివిజన్ ఇన్‌చార్జ్ గల్లా రవి, ఉమ్మడిశెట్టి, పుష్పాల రాజా, ఇతర నేతలు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామంలో శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి పి.మోహనరావు జ్యోతి వెలిగించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు మామిళ్లపల్లి ఫణికుమార్ పూజా కార్యక్రమాలు నిర్వంచారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.

ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ డీఈ నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆదివారం సమీక్ష జరిపారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలపై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఇళ్లు పూర్తయిన లేఅవుట్‌లలో వసతులు కల్పించాలన్నారు.

లయన్స్ సేవలు వినియోగించుకోవాలి




మధురానగర్(విజయవాడసెంట్రల్): లయన్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ జిల్లా గవర్నర్ శ్రీకాంతి సూచించారు. మధురానగర్ గౌతమ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంపాక్ట్, స్వర సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. సుమారు 450 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్యాం ప్రసాద్, సెక్రటరీ రామశాస్త్రి, జనార్ధనరావు, నెక్కంటి ప్రసాద్, పీవీఆర్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచి నడవడికతో అభివృద్ధి

ఆటోనగర్(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ మంచి నడవడికతో అభివృద్ధి చెందాలని జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీక్ అన్నారు. ఆదివారం రాత్రి జవహర్ ఆటోనగర్‌లోని ఒక ప్రయివేట్ హోటల్‌లో జమా అతె ఇస్లామి హింద్ విజయవాడ ఆధ్వర్యంలో మానవత- నైతికత పై ఆత్మీయ సమావేశం జరిగింది. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ సమాజంలో ఎక్కడ చూసినా మోసం, దగా అనేవి పెరిగిపోయాయన్నారు. సమాజంలో నైతికత విలువలు పెంపొందించడానికి జమాఅతెఇస్లామి హింద్ రాష్ట్రస్థాయిలో సెమినార్‌లను నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సిటీ కార్యదర్శి ఎండీ ఇబ్రహీం, హబీబ్‌ఖాన్, అబ్దుల్‌కలాం, బాబు, బాలగంగాధర్‌తిలక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై పలువురు విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీఅరుణ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు చక్కటి అభినయంతో నృత్య ప్రతిభను ప్రదర్శించారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధుల ప్రమాణ స్వీకారం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీ సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు పలువురు సంఘ ప్రతినిధులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి పలువురు బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులుగా ముస్తఫా, ఉపాధ్యక్షులుగా పుల్లారావు, ప్రధాన కార్యదర్శి మేక వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులుగా చిప్పాడ చందు బాధ్యతలు స్వీకరించారు. సంఘ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని కొత్తగా ఎన్నికైన సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కనకారావు, చల్లపల్లి మోహన్‌రావు, ధనాలకోట శోభన్‌బాబు, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్న సీఎం జగన్

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు ఏపీ కేంద్ర బిందువుగా మారిందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ కంపెనీలన్నీ సుముఖత చూపాయంటే దానికి కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడంతో సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయం ఎదుట సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షేమ పథం, అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఉన్న గొప్పవ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా రావడం అదృష్టమన్నారు. గత టీడీపీ హయంలో ఎంఓయూలు తప్పించి, ఎక్కడా అభివృద్ధి కనిపించలేదని కేవలం ప్రచారానికి మాత్రమే చంద్రబాబు పని చేశాడని విమర్శించారు. జగనన్న సంక్షేమ పాలన చూసి ప్రఖ్యాతిగాంచిన కంపెనీల అధినేతలు స్వయంగా ఈ సమ్మిట్‌లో పాల్గొని తమ పెట్టుబడులు వివరించడం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్రానికి తరలివస్తున్న పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలను చూసి ఓర్వలేని చంద్రబాబు, ఎల్లో మీడియా దీనిపై కూడా విషప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. బాధ్యతగల మీడియా రంగంలో ఉండి కూడా కొన్ని పచ్చ మీడియాలు రాష్ట్ర ప్రతిష్టతను దిగజార్చేలా రాతలు రాయడం నీచమైన సంస్కృతి అని, వీరికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రాన్ని పురోగతి వైపు నడిపిస్తున్న జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, నందెపు సురేష్, చింతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

కార్పొరేటర్ బాలిగోవింద్



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బాలిగోవింద్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి గోవింద్ అన్నారు. ఆదివారం బావాజీ పేట 1, 2 లైన్లు, శెనగశెట్టి వారి వీధిలో పర్యటించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, వీధి దీపాలు సమస్యలు, తాగునీరు ఎలా అందుతుందో అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. స్థానికులు విద్యుత్ తీగల సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా అక్కడ నుంచే వీఎంసీ సిబ్బందితో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో 36వ డివిజన్ ప్రెసిడెంట్ పులపా కృష్ణ, జొన్నలగడ్డ రామకృష్ణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'సార్' సినిమాకు ప్రత్యేక రాయితీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ధనుష్ నటించిన 'సార్' సినిమా ప్రేక్షకాదరణ పొందిందని, చిత్ర సందేశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందించాలనే ఉద్దేశంతో సినిమా ప్రదర్శనపై ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు జేపీఆర్ ఫిల్మ్స్ అధినేత, సినిమా డిస్ట్రిబ్యూటర్ డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం ఫిల్మ్ చాంబర్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమన్నారు. సార్ సినిమాలో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని హృదయానికి హత్తుకునేలా చిత్రీకరించారన్నారు. సినిమా చూసేందుకు విద్యార్థులు ముగ్గురు కన్నా ఎక్కువ మంది థియేటర్‌కు వస్తే ఒక టికెట్ పై మరో టికెట్ ఉచితంగా అందిస్తామన్నారు. 50 మంది విద్యార్థులు ఏదైనా ఒక విద్యా సంస్థ నుంచి వస్తే ఒక టికెట్‌పై ఇద్దరికి ఉచితంగా సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కోరితే వారికోసం ప్రత్యేకంగా ఒక షో ప్రదర్శిస్తామన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 'సార్' సినిమా ప్రదర్శిస్తున్న అన్ని థియేటర్లలో ఈ రాయితీ పొందవచ్చని తెలిపారు. వివరాలకు 97051 61908లో సంప్రదించాలన్నారు. సమావేశంలో సాయిరాం స్క్రీన్స్ 'అధినేత వినీత్ సాయి, సురేష్ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ మేనేజర్ భగవాన్ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో దేశ భవిష్యత్తు



విద్యార్థులను అభినందిస్తున్న ఎన్వీ రావు, ఉదయ్‌కిరణ్ తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దేశ భవిష్యత్తుకు నూతన ఆవిష్కరణలు దోహదపడతాయని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు పేర్కొన్నారు. నగరంలో ఈ నెల 2 నుంచి 4 వరకు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చూపిన 'రాకేష్' విద్యార్థులకు ఆదివారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎన్వీ రావు మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్‌లో రాకేష్ స్కూల్ విద్యార్థులు దేశానికి ఉపయోగపడే పలు అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారన్నారు. వాహనాలు నడిపేటప్పుడు నిద్ర వస్తే అప్రమత్తం చేసే పరికరం, పర్యావరణ పరిరక్షణ, దేశ రక్షణ రంగంలో కీలకమైన ఆర్మీ జవాన్లకు ఉపయోగపడే పరికరం, వృథాగా పడి ఉన్న ప్లాస్టిక్ నుంచి పెట్రోల్, గ్యాస్ తయారీ పరికరాన్ని ప్రదర్శించారన్నారు. వీటిపై కలెక్టర్ ఢిల్లీరావు ఆకర్షితులై విద్యార్థులను అభినందించారన్నారు. సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ బహుమతి సాధించిన వెంకటరమణ, సీహెచ్ వెంకటరమణ, కె.అఖిల్ బృందానికి అమెరికాకు చెందిన వెల్ ఫర్ గో ఉపాధ్యక్షులు ఉదయ్‌కిరణ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ మల్లీశ్వరి, ఎస్.కాంతికల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ చంద్రభొట్ల ఆదిత్య సూచించారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన వేసవిలో వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ మాట్లాడుతూ నగరంలోని వయోవృద్ధులను గుర్తించి వారికి ఉచితంగా ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి వైద్యులతో పరీక్షలు చేయించి మందులు అందజేస్తున్నామన్నారు. కార్పొరేటర్ శర్వాణీమూర్తి సహకారంతో ఉచితంగా రక్తపరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సుమారు 240 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హోమియో వైద్యనిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం, ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి, ట్రస్టీ తట్టి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు లక్ష్మీ జయంతి.. ప్రత్యేక పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లక్ష్మీ జయంతి పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ మంగళవారం చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి కల్యాణ మండపంలో విశేష అభిషేకాలు, అర్చనలు చేయనున్నట్లు విఖనస సేవా సమాఖ్య సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తేదీ సోమవారం సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మేదినీ పూజ జరగనున్నాయని తెలిపారు. మంగళవారం నవగ్రహారాధన, హోమం, సామూహిక కుంకుమార్చన, విశేష అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. విశిష్ట అతిథి చిన ఆగిరిపల్లి రేణుకా క్షేత్రం పీఠాధిపతి వీర కృష్ణ భవానీతో లక్ష్మి ప్రవచనం ఉంటుందని తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నట్లు కొత్త అమ్మవారి దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు పేర్కొన్నారు.